

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 08-11-2025 సంపుటి : 07 సంచిక 181 పేజీలు : 8 వెల : రూ 3-00

## ఎయిర్‌పోర్ట్‌లో చిక్కుకుపోయిన వేలాది మంది ప్రయాణికులు..



న్యూఢిల్లీ, నవంబర్ 07: దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఏటీసీ) వ్యవస్థలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావంతో దాదాపు 350 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముందుగా షెడ్యూల్ చేసిన పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో వందలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. దీని ప్రభావం ఉత్తరాది ఎయిర్ పోర్టులపైన పడింది.అయితే ఢిల్లీ ఎయిర్‌పోర్టులోని రన్ వేపై విమానాలు పార్కింగ్ చేసేందుకు సరిపడినంత స్థలం లేనందున పలు సర్వీసులు రద్దు చేసినట్లు ఎయిర్ పోర్ట్ వర్గాలు వివరించాయి. అయితే గురువారం సాయంత్రం నుంచే ఏటీసీలో ఈ సమస్య ఉత్పన్నమైందని వెల్లడించాయి. ఇక అందుబాటులో ఉన్న డేటా అధారంగా పలు విమానాల సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపింది. ఆ క్రమంలో చాలా ఆలస్యంగా విమాన సర్వీసుల నడుస్తున్నాయంది. మరోవైపు ముంబై ఎయిర్‌పోర్ట్‌లోనూ ఏటీసీ వ్యవస్థ కుప్పకూలింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఇక న్యూఢిల్లీ ఎయిర్‌పోర్టు నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతి రోజు ఇక్కడి నుంచి దాదాపు 1,500 విమానాలు రాక పోకలు సాగిస్తాయి. ట్రాకింగ్ వెబ్ సైట్‌లో విమాన సర్వీసు బయలుదేరు సమయం దాదాపు 60 నిమిషాలు ఆలస్యం చూపిస్తోంది. ఈ సాంకేతిక లోపాన్ని పరిష్కరించేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాతో కలిసి పని చేస్తున్నామని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్ ప్రతినిధి వెల్లడించారు. సాధ్యమైనంత త్వరగా ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇప్పటికే దీనిపై ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్, ఇండిగో ఎయిర్ లైన్స్ సంస్థలు తమ ఎక్స్ ఖాతా వేదికగా స్పందించాయి. ఈ చిక్కుకు పోయిన ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు సిబ్బంది సహాయం చేస్తున్నారని వివరించాయి.ఏటీసీ వ్యవస్థలో ఏర్పడిన లోపం కారణంగా.. అన్ని విమాన సర్వీసుల రాకపోకలపై ఈ ప్రభావం పడిందని స్పైస్ జెట్ ఎయిర్ లైన్స్ వెల్లడించింది. అదే విధంగా ఎయిర్ ఇండియా సంస్థ సైతం స్పందించింది. ఈ ఊహించని అంతరాయం కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపింది. ఏటీసీలో ఏర్పడిన లోపాన్ని పునరుద్దరించేందుకు టెక్నిషియన్స్ పూర్తి స్థాయిలో పని చేస్తున్నారని అధికారులు తెలిపారు. కొన్ని గంటల్లోనే సాధారణ పరిస్థితికి తీసుకు వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.ఎయిర్ పోర్టులో భారీగా ప్రయాణికుల క్యూ లైన్లు దర్శనమిస్తున్నాయి. పలు విమాన సర్వీసులను రీ షెడ్యూల్‌పై ప్రకటనల మీద ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు విమాన సర్వీసుల ఆలస్యంపై సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

## బీజేపీ, ఈసీ కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నాయి..



ఢిల్లీ: బీజేపీ, ఈసీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఓట్ల చోరీపై ఇప్పటివరకు బీజేపీ, ఈసీ స్పందించలేదని తెలిపారు. ఓట్ల చోరీతోనే నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారని ఆరోపించారు. ఓట్ల చోరీపై తమ దగ్గర చాలా సమాచారం ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. హరియాణాలో హోల్‌సేల్‌గా ఓట్ల చోరీ జరిగిందని పేర్కొన్నారు. బిహార్‌లో కూడా ఇదే ఘటన పునరావృతం కాబోతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, గుజరాత్‌లోనూ ఇదే జరిగిందని వివరించారు. ఓట్ల చోరీపై బీజేపీ ఆత్మరక్షణలో పడిందే తప్ప వ్యతిరేకించట్లేదని చెప్పారు. బీజేపీ, ఈసీ కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నాయని రాహుల్ గాంధీ మండిపడ్డారు.అయితే.. బీజేపీ, ఈసీపై గతంలో కూడా రాహుల్ గాంధీ విమర్శలు చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది హరియాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 25 లక్షల నకిలీ ఓట్లు ఉన్నాయని వాటిద్వారా అక్కడి ఎన్నికను చోరీచేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఇది ఆపరేషన్ సర్కార్ చోరీ అని విమర్శించారు. ఒక బ్రెజిల్ మోడల్ ఫొటోతో 22 నకిలీ ఓట్లు సృష్టించినా ఈసీఐ ఎందుకు కనిపెట్టలేకపోయిందని ప్రశ్నించారు. ఒకే ఇంట్లో 501 మంది ఓటర్లు ఉన్నట్లు చూపినా గుర్తించలేకపోయారన్నారు. బిహార్‌లోనూ ఇలా ఓట్ల చోరీ జరిగే ప్రమాదం లేకపోలేదని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తిప్పికొట్టింది. హరియాణాలో ఎన్నికలకు ముందు ఓటరు జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా, ఇప్పుడు అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడింది. అవన్నీ అవాస్తవాలని తిప్పికొట్టింది. రాహుల్ ఆరోపణలను ఈసీ కూడా ఖండించింది. జాబితాలపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదని ఈసీ స్పష్టం చేసింది.

## ఎఫ్ సిసిబి ద్వారా నిధుల సేకరణకు ఎంఐసి ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ బోర్డు ఆమోదం

విభారే న్యూస్ నెట్వర్క్ హైదరాబాద్ ప్రతినిధి, నవంబర్ 2025: ఎల్‌ఈడీ వీడియో డిస్ప్లేలు, హై-ఎండ్ ఎలక్ట్రానిక్స్ మరియు టెలికం ఉత్పత్తుల డిజైన్, డెవలప్‌మెంట్ మరియు తయారీ లో గ్లోబల్ లీడర్ అయిన ఎంఐసిఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ బోర్డు, షేర్‌హోల్డర్లు మరియు అవసరమైన రెగ్యులేటరీ ఆమోదాలపై ఆధారపడి, రూ 250 కోట్లు క్యూఐబి ద్వారా మరియు యు ఎస్ డి 15 మిలియన్ ఎఫ్‌ఐసిసి బి (ఫారిన్ కరెన్సీ కన్వర్టిబుల్ బాండ్స్) ద్వారా ఫండ్స్ పెంపును ఆమోదించింది.ఇటీవల ఎంఐసి, చిపెక్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ తో ఒప్పందం (మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) లోకి వచ్చింది. ఈ భాగస్వామ్యం ద్వారా ఎంఐసి తమ ఉత్పత్తుల రోడ్‌మ్యాప్‌కు అనుగుణంగా కస్టమ్ సెమికండక్టర్ పరిష్కారాలను సంయుక్తంగా అభివృద్ధి చేయడానికి చిపెక్స్ తో కలిసి పనిచేస్తుంది. కస్టమ్ సిలికాన్ ఉపయోగించడం వలన ఉత్పత్తుల్లో ప్రత్యేకత, పనితీరు, ఎనర్జీ ఎఫిషియెన్సీ మరియు గ్లోబల్ మార్కెట్లలో స్థిరత్వం పెరుగుతుందని కంపెనీ తెలిపింది. 1988 నుండి ఎంఐసిఎలక్ట్రానిక్స్ ఎల్‌ఈడీ వీడియో డిస్ప్లేలు, హై-ఎండ్ ఎలక్ట్రానిక్స్, టెలికం సాఫ్ట్‌వేర్ మరియు ఐటీ సర్వీసులలో నూతనతను మరియు మార్కెట్ నిపుణతను ప్రదర్శిస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా ఎంఐసి దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా తన ఉనికిని విస్తరిస్తోంది.ఎంఐసి యొక్క ఎల్‌ఈడీ వీడియో డిస్ప్లేలు స్పోర్ట్స్ స్టేడియాలు, ట్రాన్స్‌పోర్ట్ హబ్బులు, డిజిటల్ థియేటర్లు, థీమ్ పార్కులు, ప్రకటనల మరియు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ డిస్ప్లేల్లో విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి.

## వందేమాతర 150వ వార్షికోత్సవం..

### ప్రత్యేక నాణెం, స్టాంపు విడుదల



న్యూఢిల్లీ: వందేమాతరం గేయం 150వవార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక నాణెం, స్మారక తపాలాబిళ్లను విడుదల చేశారు. దీంతోపాటు జాతీయ గేయానికి సంబంధించి '150.ఇన్(150.తిని)' అనే ఓ స్పెషల్ పోర్టల్‌నూ ఆయన ఆవిష్కరించారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వందేమాతరం సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ.. 'వందేమాతరం' అనే పదం మన వర్తమానంలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తిస్తుందని, తద్వారా మనం సాధించలేని లక్ష్యమంటూ ఏదీలేదనే ధైర్యాన్నిస్తుందని చెప్పారు. ఫలితంగా కోట్లాది మంది భారతీయుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుందని ఉద్ఘాటించారు. మోదీకి మద్దతుగా సమాజంలోని అన్నివర్గాల పౌరులు బహిరంగ ప్రదేశాల్లో సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు.ఈ వార్షికోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఏడాది పొడవునా మోదీ పిలుపునిచ్చారు. దీనికోసం ఈ ఏడాది అక్టోబర్ 1న కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన అన్నారు. దేశపౌరుల్లో ముఖ్యంగా యువతలో విప్లవాత్మక స్ఫూర్తిని రగిలించే ఈ గేయంను ఏడాది పాటు ఓ ప్రత్యేక కార్యక్రమంలా నిర్వహించడం వల్ల భావితరాల హృదయాల్లో చిరకాలం నిలుస్తుందని చెప్పారు.

## ఉపాధి హామీ, సాగునీటిపై దృష్టి సారించాలి

**హంద్రీ-నీవా కాలువ ద్వారా చెరువులకు నీరు నింపండి**
**జడ్పీ చైర్‌పర్సన్ ఎర్రబోతుల పాపిరెడ్డి**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 07-ఉపాధి హామీ పథకం కింద పనులు లేని వారందరికీ ఉపాధి కల్పిస్తూ, రైతులకు ప్రయోజనకరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు.కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉమ్మడి కర్నూలు? నంద్యాల జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఎ.సిరి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పాపిరెడ్డి మాట్లాడుతూ, అవుకు రిజర్వాయర్‌లో 4 టీఎంసీల సామర్థ్యం ఉన్నప్పటికీ కేవలం 2.5 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయని, మిగిలిన పనులు వేగంగా పూర్తి చేసి పూర్తి సామర్థ్యంతో నీరు నిల్వచేయాలని ఆదేశించారు. హంద్రీ?నీవా ప్రధాన కాలువ ద్వారా చెరువులకు నీటిని నింపే పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.నంద్యాల కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ, తుఫాను కారణంగా 11,448 హెక్టార్ల పంట నష్టపోయిందని, నష్టపరిహార ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. పంటలు విక్రయించేలా అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందేలా చూడాలని కోరగా, కలెక్టర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో రూ.586.03 లక్షలతో 137 పనులు ఆమోదం పొందాయి. సున్నిపెంట గ్రామ క్లాప్ మిత్రులకు రూ.16.80 లక్షలు, జడ్పీ నూతన భవనంలో లిఫ్ట్ ఏర్పాటు కోసం రూ.25 లక్షలు మంజూరయ్యాయి.



# సంపాదకీయం

శనివారం 08-11-2025

## పీఓకే దిశగా అడుగులు పడుతున్నాయా..

దేశ విభజన సమయంలో అప్పటి కశ్మీర్ రాజు హరిసింగ్ తన రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు పలు ప్రయత్నాల తర్వాత అంగీకరించారు. ఆ ప్రక్రియ సాంకేతికంగా పూర్తయింది. కాని వాస్తవ స్థితిని చూసినపుడు, కశ్మీర్‌లో కొంత భాగం పాకిస్థాన్ ఆక్రమణకు గురై ఇప్పటికీ వారి అధీనంలోనే ఉంది. ఈ భాగం, ఆ భాగం అని గాక మొత్తం కశ్మీర్ ప్రశ్నపై రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధాలలో ఏమీ తేలలేదు. భారత సైన్యం తూర్పు పాకిస్థాన్‌ను విడదీసి అక్కడి పాకిస్థాన్ సైన్యాన్ని పెద్ద సంఖ్యలో బందీగా పట్టుకున్నపుడు, పిఓకెను మనకు వదలుకున్నట్లయితేనే ఆ బందీలను వదలగలమనే షరతు విధించవలసిందనే అభిప్రాయం ఒకటుంది. ఎందుకైతేనేమి అది జరగలేదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం, కశ్మీర్ సరిహద్దు వివాద పరిష్కారంపై చర్చలు జరిగాయి గాని, పిఓకెను సైనికంగా స్వాధీన పరచుకోవడమనే అంశం అజెండా పైకి రాలేదు. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చినప్పటి నుంచి పిఓకె స్వాధీనం ప్రస్తావనలు వస్తున్నాయి. ఎప్పటికైనా ఆ పని చేస్తామంటున్నారు. ఆయన నాయకత్వాన గత ప్రధాని వాజపేయికి మించి తీవ్ర జాతీయవాద వైఖరిని అవలంబిస్తున్నందున అటువంటి ప్రస్తావనలు సహజమనాలి. ఆ ధోరణికి అనుగుణంగానే ఆయన ప్రభుత్వం, కశ్మీర్ వివాదమంటూ అసలు ఏమీ లేదని, దానిపై పాకిస్థాన్‌తో చర్చించవలసింది కూడా ఏమీ లేదని, చర్చించటమంటూ ఉంటే వారు పిఓకెను మనకు వశపరచటం గురించి మాత్రమేనని అంటూ వస్తున్నది. అందుకు పొడిగింపుగా మాట్లాడుతూ, మనమే ఒక రోజు ఆ భూభాగాన్ని స్వాధీనపరచుకోగలమని చెప్తున్నది. దీనంతటిలోని సాంకేతికతలను అట్లుంచితే, ఆచరణకు సంబంధించిన ప్రశ్నలు కొన్నింటిని గమనించవలసి ఉంటుంది. ఆ విధమైన ఆక్రమణ సాధ్యమా అన్నది ఒక ప్రశ్న కాగా, ఒకవేళ ఆక్రమించినా దానిని అధీనంలో ఉంచుకుని నియంత్రించగలరా అన్నది మరొక ప్రశ్న. యుద్ధాలు, ఆక్రమణలు, నియంత్రణలు అనే మూడు కూడా ఆషామాషీ విషయాలు కావు. అందువల్ల ఆవేశంతోగాక జాగ్రత్తగా ఆలోచించవలసి ఉంటుంది. మొదట యుద్ధం మాట చూస్తే, పాకిస్థాన్ కన్న ఇండియా చాలా శక్తివంతమైనదని వేరే చెప్పనక్కరలేదు. కాని ఇరువురికి అణ్వస్త్రాలు ఉండటం విస్మరించలేనిది. పాకిస్థాన్ 'న్యూక్లియర్ విధానం' ప్రకారం, తమ భూభాగానికి, భౌగోళిక సమగ్రతకు ముప్పు ఏర్పడినట్లయితే అణ్వస్త్రాలు ఉపయోగిస్తారు. ఆ పని నిజంగా జరుగుతుందా అనేది వేరే విషయం. కాని, జరగదని కూడా ఎవరూ హామీ ఇవ్వలేరు. ఒకసారి తూర్పు పాకిస్థాన్‌ను కోల్పోయిన తర్వాత, మరొక భూభాగాన్ని పోగొట్టుకునేందుకు సిద్ధపడటం తేలిక కాదు. అందువల్ల, పిఓకెను స్వాధీనపరచుకునే లక్ష్యంతోనే యుద్ధమన్నది తేలిక కాదు. ఆ స్థాయి యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా జోక్యమన్నది సరేసరి. పిఓకె స్వాధీనం జరుగుతుందని వాదన కోసం ఒప్పుకుంటే, అపుడు నియంత్రణ ప్రశ్న ముందుకు వస్తుంది. స్వాధీనం తక్షణం జరిగేది కాగా, నియంత్రణ దీర్ఘకాలికం. అందులోని సాధకబాధకాలేమిటి? కశ్మీర్ లోయ భూభాగం 15 వేల చదరపు కిలోమీటర్లకు పైగా ఉంది. పిఓకె వైశాల్యం అంతకు రెట్టింపు కన్న ఎక్కువ. జనాభా ఇక్కడ సుమారు కోటీ 80 లక్షల కాగా, అక్కడ దాదాపు 55 లక్షలు. వీరంతా ముస్లింలే. ఇటు వైపు భూభాగం ఏ విధంగానైతే కొండలు, లోయలు, నదులతో సంక్లిష్టమైనదో, అటువైపుది బహుశా అంతకన్న సంక్లిష్టమైనది. ఇటువైపు గలవారికి మన పట్ల ప్రేమ, విధేయత అన్నవి లేవనుకుంటే, వారికీ లేవు. వీరు నిరసనలకు, తీవ్రవాద చర్యలకు పాల్పడుతున్నారనుకుంటే, అటువైపు వారు అందుకు తోడవుతారు. అటువైపు వారికి పాకిస్థాన్ పట్ల కొంత నిరసన ఉండవచ్చు. దాని అర్థం ఇండియాను ప్రేమిస్తున్నారని కాదు. వీరూవారు కలిస్తే కశ్మీరీ జాతి మొత్తంగా స్వతంత్ర భావనలు బలపడి, రెండు దేశాలతో సంబంధం లేని విధంగా స్వతంత్ర కశ్మీర్ ఆలోచనలు తలెత్తగల అవకాశం ఎంతైనా ఉంటుంది. రెండు కశ్మీర్‌లను ఆనుకుని ఉత్తరాన, పడమరన అఫ్ఘానిస్థాన్‌తోపాటు మధ్య ఆసియా ముస్లిం దేశాలు విస్తరించి ఉన్నాయి. వాటన్నింటా ఇస్లామిస్ట్ తీవ్రవాద సంస్థలున్నాయి. లోగడ ఒక దశలో ఆ సంస్థలు కొన్ని కశ్మీర్‌ను ఇండియా నుంచి విముక్తం చేయగలమని ప్రకటించి అక్కడి సంస్థలకు ఆయుధాలు, నిధులు, శిక్షణలు కూడా ఇచ్చాయి. మధ్య ఆసియాలోని ఇస్లామిస్ట్ తీవ్రవాదం కొన్ని దశాబ్దాలుగా అంతులేకుండా పెచ్చరిల్లుతూనే ఉంది. సమయానుసారంగా ఆ ధోరణులకు ఆ ప్రాంతపు దేశాలలోపాటు, తమ వ్యూహాత్మక క్రీడల కోసం అగ్రరాజ్యాలూ ప్రోత్సాహం ఇస్తూనే ఉన్నాయి ఇప్పటికే కశ్మీర్‌లో మన బలగాలు కొన్ని లక్షలు మోహరించి ఉన్నట్లు అంచనా. పిఓకె స్వాధీనం తర్వాత మరెన్ని మోహరింపులు అవసరం కావచ్చు? ఎంతకాలం? అట్లయినా పిఓకె శాశ్వతంగా భారతదేశంలో ఉండిపోగలదనే హామీ ఉంటుందా? కశ్మీర్ విషయమై నెహ్రూ తప్పు చేసారనేది. ఈ మాటను ప్రధాని మోడీ అక్టోబర్ 31న సర్దార్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఆయన 'ఐక్యతా విగ్రహం' వద్ద ప్రసంగిస్తూ మరో మారు అన్నారు. కశ్మీర్ సంస్థానం మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలన్నది పటేల్ ఆకాంక్ష కాగా, అందుకు నెహ్రూ అడ్డుపడ్డారని ఆరోపించారు మోడీ. దేశ ప్రజలపై గాంధీజీ, నెహ్రూల ప్రభావం ఇప్పటికీ తగినంత ఉన్నందున, దానిని దెబ్బ తీస్తూపోతే ఆ మేరకు తమ ప్రభావం అందుకోసం ఆ ఇరువురిపై రకరకాలగా ఆరోపణలు, విమర్శలు తరచు చేస్తూ వస్తున్నారు.

# ప్రజాసేవలో ముందంజలో నెరవాటి ఆసుపత్రి

## 400 మందికి ఉచిత వైద్య సేవలు నెరవాటి ఆసుపత్రి?లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవంతమైన శిబిరం



వైద్య శిబిరంలో ఉచిత మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ వినోద్.

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 07-:పద్మావతి నగర్‌లోని నెరవాటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విశేష స్పందనతో విజయవంతమైంది. నెరవాటి ఆసుపత్రి, నంద్యాల లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నెరవాటి ఆసుపత్రి వైద్యులు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తున్నారని, ఉచిత సేవలు అందించడం అభినందనీయమన్నారు. డాక్టర్ నెరవాటి వినోద్, డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ ఆసుపత్రి స్థాపించి 21 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. సుమన్ కుమార్, ఫాతిమా బి, దేవేంద్ర నాయక్ లతోపాటు చెవి?ముక్కు?గొంతు, స్త్రీరోగాలు, ఎముకలు?కీళ్లు, బిపి, షుగర్ వంటి విభాగాల్లో ఉచిత సేవలు అందించామన్నారు. శిబిరంలో 400 మందికి పైగా రోగులు వైద్యులను సంప్రదించి, లక్ష రూపాయల విలువైన ఉచిత పరీక్షలు, మందులు పొందారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త నెరవాటి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, జోన్ చైర్మన్ నిజాముద్దీన్, కోశాధికారి అమిదేల జనార్ధన్, డాక్టర్ గగన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# నా రాజీనామా కు కారణం కూడా అదే...

## ఇప్పుడు ఎమ్మెల్యే తెర వెనుక రాజకీయం, కిబాల అందరి సమక్షంలో ట్రాన్స్లేట్ చేయించాలి మున్సిపల్ భూమి రక్షణకై జేఏసీ ఏర్పాటు చేయాలి. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి

జగిత్యాల, పెట్రోల్ పంపుకు అన్ని అనుమతులు ఉన్నట్లయితే ఆరోజు నా మీద ఒత్తిడి తీసుకురావడానికి కారణం ఏంటని ? నిజాలు తెలిసి కూడా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెర వెనుక రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలో సంచలనంగా 100 కోట్ల భూకబ్జా ఆరోపణలపై శ్రావణి స్పందించారు. తాను మున్సిపల్ చైర్ పర్సన్ గా ఉన్నప్పుడే పెట్రోల్ పంపు భూకబ్జా విషయంలో మాట్లాడితే తనను టార్గెట్ చేశారన్నారు. ఒక దశలో చైర్పర్సన్ గా తన రాజీనామాకు ఈ పెట్రోల్ పంపు వ్యవహారమే కారణమని అన్నారు. గతంలోనే రెండు మూడు సందర్భాల్లో తన రాజీనామా కు ముందు ఆ తర్వాత కూడా తాను మున్సిపల్ భూమి కబ్జాతో పాటు పెట్రోల్ పంప్ వ్యవహారం పై విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసి ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. యావర్ రోడ్డు విస్తరణకై తొలి ప్రయత్నంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం డివైడర్ కడుతున్న సందర్భంలో ఐదు ఫీట్లు ఆర్ అండ్ బి ఆఫీస్ సైడ్ అలైన్మెంట్ చేయించినట్లు తెలిపారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం డివైడర్ కడితే పెట్రోల్ పంపు విషయం బయటకు వస్తుందని ఒత్తిడి తీసుకువచ్చారన్నారు. ఒక దశలో మొదలుపెట్టిన డివైడర్ నిర్మాణాన్ని సైతం మార్చి కట్టేలా చేసారని, కబ్జాలకు పాల్పడిన వారిని కాపాడేందుకు అప్పుడున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నన్ను నడిరోడ్డు పైన నిలబెట్టి ఇది మా వ్యక్తిగత విషయం నువ్వు తలదూర్చకని ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. పెట్రోల్ పంపుకు అన్ని అనుమతులు ఉన్నట్లయితే ఆరోజు నా మీద ఒత్తిడి తీసుకురావడానికి కారణం ఏంటని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను ఉద్దేశిస్తూ మాట్లాడారు నిజాలు తెలిసి కూడా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెర వెనుక రాజకీయాలు చేస్తున్నారు. 1948 సెప్టెంబర్ 17 న నిజాం పాలనా ముగిసి 1949 ఇండియన్ స్టాంప్ యాక్ట్ అమల్లోకి వస్తే 1952లో అసలు అమలులో లేని కిబాల ద్వారా స్థలం కొన్నట్టు ఏ విధంగా తెరపైకి వచ్చిందో అర్థం కావడం లేదు అన్నారు. ఈ విషయంలో ఇప్పటికే అధికారులపై పొలిటికల్ ప్రెజర్ ఉందని సందేహాత్మకంగా ఉన్న కిబాల పత్రాన్ని అందరి సమక్షంలో ట్రాన్స్లేట్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు అప్పీల్ చేశారు. తాను చైర్ పర్సన్ గా ఉన్నప్పుడు ఈ వ్యవహారానికి సంబంధించి ఎలాంటి రికార్డులు మున్సిపల్ లో లభించలేదన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న జీవన్ రెడ్డి ఇప్పటికైనా ఈ వ్యవహారంపై మాట్లాడడం హర్షించదగ్గ విషయమని అయితే మున్సిపల్ ప్రభుత్వ భూముల రక్షణకై పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అవసరమైతే మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక జేఏసీ ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ప్రజల ఆస్తి ప్రజలకు చెందేలా చేయాలని ఇందుకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్న సహకారం ఉంటుందని తెలిపారు. ఇక ఇటీవల అర్బన్(న్యాఫ) డెవలప్మెంట్ ఫండ్స్ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తే స్థానిక ఎమ్మెల్యే తానే తీసుకువచ్చినట్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. అభివృద్ధి చేయండి హర్షిస్తాం కానీ మందికి పుట్టిన పిల్లల్ని తమ పిల్లలని చెప్పుకోవడం ఎంతవరకు కరెక్ట్ అన్నారు. జగిత్యాలను ఎడ్యుకేషనల్ హబ్ గా మార్చేందుకు ఎంపీ అరవింద్ అన్న కృషి చేస్తున్నారని అందులో భాగంగానే జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి,జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్, బొడ్డు పెద్ద గంగారం, జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, జిల్లా కార్యదర్శులు పాత రమేష్, సాంబారి కళావతి, సిరికొండ రాజన్న, గాదాసు రాజేందర్, మద్రిపల్లి సాగర్, ఇట్యాల రాము, కాశెట్టి తిరుపతి, గడ్డల లక్ష్మి, మామిడాల కవిత, బద్దెల గంగరాజం మరియు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు పై గుంతల మరమ్మత్తులు వెంటనే చేయాలి

## రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 7, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కొండంత దూరం ఉందని,ప్రజలతో చెలగాటం ఆడుతున్నారనిమండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావుల సోమయ్య అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు కరకగూడెం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డిజిటల్ క్యాంపెనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల సోమయ్య మాట్లాడుతూ...బయ్యారం(కరకగూడెం)-తాడ్వాయిప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలకు దారి తీస్తుందని,రోడ్లు మరమ్మత్తులు చేయకుంటే ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆక్షేపించారు. జిల్లా మంత్రులు వెంటనే స్పందించి డిఎంఎఫ్ టి,సిఎస్ఆర్ నిధుల నుండి రోడ్ల పై ఏర్పడిన గుంతలను మరమ్మత్తులు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేశారు. రోడ్లు మరమ్మత్తులు చేయకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొమరం రాంబాబు,అక్కిరెడ్డి వెంకటరెడ్డి,రేగా సత్యనారాయణ,బైరిశెట్టి చిరంజీవి,పోగు వెంకటేశ్వర్లు,బుడగం రాము,గుడ్ల రంజిత్,అత్తె సత్యనారాయణ,మాజీ సర్పంచులు:ఊకే రామనాథం,పాయం నరసింహారావు,కొమరం విశ్వనాథం,కొమరం శ్రీను,భూక్య అర్జున్,గొగ్గల నారాయణ,పోగు ఎల్లగౌడ్,పఠాన్ యాకుబ్ ఖాన్,ఈసం సమ్మయ్య,పులి శ్రీధర్,గుమ్మడివెల్లి ప్రసాద్,భాస్కర్,యలగొండ శ్రీను,తోలెం రామారావు,మలకం వెంకటేశ్వర్లు,గుర్రం లాలు,సోషల్ మీడియా మండల అధ్యక్షులు సిద్ధి సునీల్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప భక్తులకు గుడ్‌న్యూస్.. భారీగా ప్రత్యేక రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్యరైల్వే



శబరిమల అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీ నుంచి రైళ్లు రాకపోకలు సాగిస్తాయని పేర్కొంది. చర్లపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్ నుంచి రైళ్లు కొల్లానికి వెళ్తాయని చెప్పింది. చర్లపల్లి-కొల్లం (07107) రైలు నవంబర్ 17, 24, డిసెంబర్ 1, 8, 15, 22, జనవరి 5, 12, 19 తేదీల్లో అందుబాటులో ఉంటాయని.. ఆయా రైళ్లు ప్రతి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని పేర్కొంది. కొల్లం-చరల్లపల్లి (07108) రైలు నవంబర్ 19, 26, డిసెంబర్ 3, 10, 17, 24, 31, జనవరి 7, 14, 21 తేదీల్లో అందుబాటులో ఉంటాయని.. ప్రతి బుధవారం ఉదయం 2.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని వివరించింది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడె, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పడి, జోలార్‌పేటై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొడనూర్, పాలక్కడ్, త్రిస్సూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, తిరువల్ల, కాయంకులం స్టేషన్లలో ఆగుతుందని తెలిపింది. నర్సాపూర్-కొల్లం (07105) రైలు నవంబర్ 16, 23, 30, డిసెంబర్ 7, 14, 21, 28, జనవరి 4, 11, 18 తేదీల్లో రైళ్లు నడుస్తాయని.. ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు గమ్యస్థానం చేరుతుందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. కొల్లం-నర్సాపూర్ (07106) రైలు నవంబర్ 18, 25, డిసెంబర్ 2, 9, 16, 23, 30 జనవరి 6, 13, 20 తేదీల్లో రైళ్లు నడుస్తాయని.. ప్రతి ఆదివారం వేకువ జామున 2.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని పేర్కొంది. రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడురు, రేణిగుంట, కాట్పడి, జోలార్‌పేటై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూరు, పాలక్కడ్, త్రిస్సూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, తిరువల్ల, చెంగనూర్, కాయంకులం స్టేషన్లలో ఆగుతుందని వివరించింది.

# నార్నూర్ మండలంలో వందేమాతరం గీత ఆలాపన



నార్నూర్ : వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలంలో శుక్రవారం అధికారులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వందేమాతరం ఉద్దేశం, గీతం దేశానికి ఉపయోగపడ్డ తీరును వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ ఎంఈవో పవర్ అనిత, గాదిగూడ ఎంపీ ఓ రమేష్, మాజీ జడ్పీటీసీ హేమలత బ్రిజ్జిలాల్, నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేస్రం హన్మంతరావు, దళిత అవార్డు గ్రహీత కొరల మహేందర్, నాయకులు చౌహాన్ యశ్వంత్ రావు, సుల్తాన్ [illegible] న్నారు.

# గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



నార్నూర్ : గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలుఅందేలా చూడాలని అడిషనల్ డీఎంహెచ్ఓ కుడ్మెత మనోహర్ వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రసూతి గది, రికార్డులను పరిశీలిస్తూ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానా లోనే ప్రసవాలు అయ్యేలా గర్భిణులను ప్రోత్సహించాలని సూచించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతినెల ఆరోగ్య పరీక్షలు తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

# రాజకీయాలకు దూరంగా..తమిళ సినిమాలకు దగ్గరగా...

విజయవాడ, నవంబర్ 7, ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ ముద్ర సంపాదించుకున్నారు మాజీ మంత్రి ఆర్కే రోజా. కానీ ఇటీవల ఏపీ రాజకీయాల్లో పెద్దగా కనిపించడం లేదు. తాడేపల్లి వైపు కూడా రావడం మానేశారు. సొంత నియోజకవర్గ నగరిలో అప్పుడప్పుడు హడావిడి చేస్తున్నారు. రికార్డింగ్ వీడియోలను మీడియాకు విడుదల చేసి ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నారు. అది కూడా ఏదో ఒక ప్రత్యేక సందర్భంలోనే. అయితే రాజకీయాలను క్రమేపీ విడిచి పెట్టాలన్న ఆలోచనలో రోజా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తెలుగు నాట ఉండకుండా.. తమిళనాడులో సెటిలై పోవాలన్న ఆలోచనలో ఆమె ఉన్నట్లు సమాచారం. తమిళ సినీ పరిశ్రమలో ఇప్పుడు గట్టి అవకాశాల కోసం రోజా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.మాజీ మంత్రి రోజా ఇటీవల మీడియాలో కూడా కనిపించడం లేదు. అయితే వైసిపి నాయకత్వం ఆమెను వద్దనుకుందా? లేకుంటే ఆమె బయటకు వెళ్లిపోయిందా అన్నది తెలియడం లేదు. ఎందుకంటే అప్పుడప్పుడు కూటమి ప్రభుత్వంపై రోజా విమర్శలు చేస్తూనే ఉన్నారు. అయితే రోజా లాంటి నేతలు ఉంటే తాము పార్టీలో ఉండలేమని కొంతమంది వైసీపీ సీనియర్లు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. అందుకే వెనువెంటనే శ్యామలాన్ని తీసుకొచ్చి అధికార ప్రతినిధిని చేసినట్లు ప్రచారం సాగుతోంది. కేవలం రోజాకు మాత్రం అవసరమైన సమయంలో కంటెంట్ పంపించి మాట్లాడిస్తున్నట్లు సమాచారం. అయితే పొమ్మనలేక ఆమెను పొగ పెట్టినట్లు వైసిపి వర్గాల్లో ప్రచారం సాగుతోంది. రోజా సైతం ఈ సమీక్షలకు హాజరు కావడం లేదు. తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో కూడా పెద్దగా కనిపించడం లేదుతెలుగు చిత్ర పరిశ్రమతో పాటు బుల్లితెరపై ఒక వెలుగు వెలిగారు రోజా. కానీ రాజకీయాల్లో దూకుడు తనం ప్రదర్శించి హుందాతనాన్ని పోగొట్టుకున్నారు. దాని పర్యవసానాలు ఇప్పుడు అనుభవిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో సరైన అవకాశాలు దక్కడం లేదు. అందుకే తమిళ చిత్ర పరిశ్రమపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. తాజాగా లెనిన్ పాండియన్ అనే సినిమాలో రోజా నటిస్తున్నట్లు సమాచారం. అందులో వృద్ధురాలిగా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్ర దక్కినట్లు తెలుస్తోంది. ఆ పాత్ర సక్సెస్ అయితే ఆమెకు మరిన్ని అవకాశాలు వచ్చే పరిస్థితి ఉంది. హీరోయిన్గా తమిళనాడులో ఒక ఊపు ఊపారు రోజా.కానీ తెలుగు చిత్ర పరిశ్రమతో పాటు రాజకీయాల్లో ప్రవేశించి రాణించారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏపీలో ఉంటే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని ఆమె గుర్తించినట్లు సమాచారం. ఆమె వల్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందన్న వారు కూడా ఉన్నారు. అందుకే సొంత పార్టీలో ప్రత్యర్థులను ఎదుర్కోలేక.. కూటమి దూకుడు తట్టుకోలేక ఏపీ రాజకీయాలను విడిచి పెడుతున్నట్లు తెలుస్తోంది.కూటమి ప్రభుత్వం రోజా విషయంలో దూకుడుగా ఉన్నట్లు ప్రచారం సాగింది. వైసిపి హయాంలో ఆమె క్రీడల శాఖ మంత్రిగా వ్యవహరించారు.

ఆ సమయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా భారీగా అవినీతి జరిగిందన్నది కూటమి ప్రభుత్వం ఆరోపణ. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విజిలెన్స్ విచారణ సాగింది. ఆ విచారణ నివేదిక ప్రభుత్వానికి వచ్చింది. రోజా అరెస్టు ఖాయమని ప్రచారం సాగింది. అది మొదలు రోజా ఏపీలో కనిపించకుండా మానేశారు. ఆపై తమిళ చిత్ర పరిశ్రమలో అవకాశాలు దక్కుతుండడంతో.. ఇక రాజకీయాలకు రోజా దూరమవుతారని ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి


# లూలూ గ్రూప్ పై ప్రేమ ఎందుకో...

విజయవాడ, నవంబర్ 7, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లూలూ గ్రూప్‌కు విశాఖపట్నం, విజయవాడలో ప్రధాన భూములు లీజ్‌పై అలాట్ చేయడం వెనుక భారీ సబ్సిడీలు, రివర్షన్ క్లాజ్‌లు లేకుండా లీజ్‌లు ఇవ్వడం వంటి నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఇటీవలే అహ్మదాబాద్‌లో 519 కోట్ల రూపాయలకు 16 ఎకరాలు కొన్న లూలూ ఇంటర్నేషనల్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఏపీలో మాత్రం ప్రభుత్వ భూములను 'సబ్సిడీ' రూపంలో తక్కువ రేట్‌లో తీసుకుంటూ, విలువైన ఆస్తులను కార్పొరేట్ లాభాలకు మార్చుకుంటోంది. అహ్మదాబాద్‌లోని చంద్‌ఖేడా ప్రాంతంలో లూలూ గ్రూప్ 16.35 ఎకరాల ప్రధాన భూమిని 519.41 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. ఈ డీల్ అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో జరిగింది, ఇక్కడ లూలూ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మార్కెట్ రేట్‌లో పూర్తి చెల్లింపు చేసి, రికార్డు స్థాయి 31.16 కోట్ల రూపాయల స్టాంప్ డ్యూటీ చెల్లించింది. ఈ భూమిపై మెగా మాల్ నిర్మాణం ప్రణాళికలో ఉంది, ఇది గుజరాత్‌లోని రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ఊపునిస్తోంది. ఈ డీల్ ఏపీలో జరుగుతున్న అలాట్‌మెంట్‌లతో పోల్చితే పూర్తి భిన్నంగా ఉంది. అహ్మదాబాద్‌లో ప్రభుత్వ సబ్సిడీలు లేకుండా, పూర్తి మార్కెట్ విలువతో కొనుగోలు చేసిన లూలూ, ఏపీలో మాత్రం ప్రభుత్వ భూములను తక్కువ రేట్‌లో లీజ్‌పై తీసుకుని, "సబ్సిడీ"లా మార్చుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025 జులైలో జారీ చేసిన ఊా 137 ,,,, ఊా 45 ప్రకారం, విశాఖపట్నంలో 13.74 ఎకరాలు, విజయవాడలో 4.15 ఎకరాలు ఆర్టీసీ భూములను లూలూ గ్రూప్‌కు లీజ్‌పై అలాట్ చేసింది. విశాఖలో భూములు హార్బర్ పార్క్ సమీపంలో, బీచ్ వద్ద ఉన్న ప్రధాన ప్రదేశాల్లో ఉన్నాయి. విలువ సుమారు 2,000 కోట్ల రూపాయలు ఉంటుంది. ఆంధ్రా టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2024-29 ప్రకారం, 65 సంవత్సరాల లీజ్ (మరో 33 సంవత్సరాలు పొడిగించుకోవచ్చు) ఇచ్చారు, కానీ రివర్షన్ క్లాజ్ (ప్రాజెక్ట్ ఫెయిల్ అయితే భూమి తిరిగి ప్రభుత్వానికి) లేకపోవడం, తక్కువ రేట్ లో ఇవ్వడం వంటి అంశాలు వివాదానికి కారణమయ్యాయి. విజయవాడలో మాల్ ప్రాజెక్టుకు 1,222 కోట్ల పెట్టుబడి ప్రకటించినప్పటికీ, భూమి అలాట్‌మెంట్‌లో పారదర్శకత లేకపోవడం వల్ల ప్రజలు, రైతు సంఘాలు నిరసనలు చేస్తున్నారు.

ఈ ప్రాజెక్టులు 10,000 ఉద్యోగాలు సృష్టిస్తాయని ప్రభుత్వం చెప్పినా ఆ ఉద్యోగాలు ఎవరికిస్తారన్నదానిపైనా విమర్శలు ఉన్నాయి. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు ఈ ల్యాండ్ అలాట్‌మెంట్ ను వ్యతిరేకిస్తున్నాయి. విజయవాడ భూమిని ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్లు ఊా 137ను వ్యతిరేకిస్తూ, భూములు మాల్‌లకు మార్చడం వల్ల పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ బలహీనపడుతుందని హెచ్చరించాయి. సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్లు విజగ్‌లో 14 ఎకరాల ప్రైమ్ ల్యాండ్‌ను ఉచితంగా ఇవ్వడాన్ని "ప్రభుత్వ అనైతికత"గా అభివర్ణించాయి. "లూలూ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బూస్ట్ ఇస్తాయి" అని ప్రభుత్వం వాదిస్తోంది. అహ్మదాబాద్‌లో మార్కెట్ రేట్‌లో పెట్టుబడి చేసిన లూలూ, ఏపీలో సబ్సిడీలతో భూములు తీసుకోవడం వల్ల "డబుల్ స్టాండర్డ్" ఆరోపణలు ఎదుర్కొంటోంది. వైసీపీ, సీపీఎలులు రద్దు డిమాండ్ చేస్తుంటే,టీడీపీ ప్రభుత్వం "ఉద్యోగాలు, పెట్టుబడి"ని హైలైట్ చేస్తోంది. పరిశ్రమలకు అంటే సరే..కానీ మాల్స్ కు కూడా భూమిని ఎందుకు సబ్సిడీకి ఇవ్వాలన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పుడు బడా కంపెనీలు విశాఖకు వస్తున్నందున.. ఆ భూమిని వేలం వేస్తే.. కంపెనీలు కొనుగోలు చేసి పెద్ద మాల్స్ నిర్మిస్తాయని అంటున్నారు. ప్రభుత్వం ఇలాంటి వాటికి సమాధానం చెప్పకపోతే.. లూలుతో కుమ్మక్కయ్యారని ప్రజలు అనుకునే అవకాశం ఉంది.

# 25 లక్షలకుపైగా ఇళ్లకు కుళాయి కనెక్షన్లు

శ్రీకాకుళం, నవంబర్ 7, ఏపీలో తాగునీటి కష్టాలు తీరనున్నాయి. కుళాయి ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందించేందుకు కేంద్రం చేపట్టిన జల్ జీవన్ మిషన్‌లో ఆగిపోయిన పనులను పూర్తి చేసేందుకు.. కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా జాతీయ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు నుంచి రూ. 10వేల కోట్ల రుణం తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ విషయంపై బ్యాంకు అధికారులతో ఏపీ ప్రభుత్వం ప్రతినిధులు చర్చలు జరిపారు. దీంతో రుణం ఇచ్చేందుకు బ్యాంకు అంగీకరించింది. లోన్ మొత్తాన్ని మూడు విడతల్లో విడుదల చేస్తామని బ్యాంకు ప్రాథమికంగా తెలిపింది. అయితే ఈ రుణానికి సంబంధించిన ప్రతిపాదనలు బ్యాంకు టెక్నికల్ ఫీజిబిలిటీ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. ఆ కమిటీ ఆమోదిస్తే.. ఈ నెల చివర్లో లోన్ మంజూరు అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.తాగునీటి కుళాయి కనెక్షన్ ప్రాజెక్టు డీపీఆర్‌కు ఆమోదం లభించిన తర్వాతే ఈ నిధులు మంజూరు కానున్నాయి. ప్రజలకు మంచినీరు సరఫరా చేసేందుకు గత ప్రభుత్వంలో బోరు బావుల నుంచి నీరు సేకరించేవారు. అయితే వేసవిలో భూగర్భజలాలు అడుగంటినప్పుడు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కూటమి ప్రభుత్వం గుర్తించింది. అందుకే ప్రణాళికలు మార్చి.. నదులు, జలాశయాల నుంచి నీరు సేకరించేలా.. వాటిని కుళాయిల ద్వారా ప్రజలకు రక్షిత మంచినీరు ఏడాది పొడవునా అందించేలా రూ.84,500 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారుచేయించింది. ఈ డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభిస్తేనే ఔజీఃఈఎఆ రుణం మంజూరు చేస్తుంది.జల్జీవన్ మిషన్‌లో భాగంగా... కేంద్ర ప్రభుత్వం మొదట ఆమోదించిన రూ.27వేల కోట్ల ప్రాజెక్టును పూర్తి చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని కూటమి ప్రభుత్వం ఆరోపిస్తోంది. రాష్ట్రం వాటా నిధులు సరిగా కేటాయించలేదని.. 2019-24 మధ్య రూ. 4 వేల కోట్లకు మించి వినియోగించుకోలేదని ఆరోపించింది. పనులు కూడా అరకొరగా చేపట్టిన కారణంగా.. తాగునీటి సరఫరా చేయలేకపోయిందని చెబుతోంది. ఈ నేపథ్యంలో పెండింగ్ పనులను తాము పూర్తి చేయడంపై దృష్టి సారించామని వెల్లడించింది. అందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న రూ. 23 వేల కోట్ల విలువైన పనులు పూర్తిచేసి ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న కేంద్రప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపింది.మొత్తం రూ. 23 వేల కోట్లలో... రుణం ద్వారా రూ. 10 వేల కోట్లు ఏపీ ప్రభుత్వం తమ వాటా కింద సమకూర్చుతోంది. మిగతా రూ. 13 వేల కోట్లు కేంద్రం ఇవ్వనుంది. పెండింగ్ పనులను వచ్చే రెండు, మూడేళ్లలో పూర్తిచేసి.. 25 లక్షలకుపైగా ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. శ్రీకాకుళం, అనకాపల్లి, పల్నాడు, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, విజయనగరం, కర్నూలు, అనంతపురం వంటి వెనుకబడిన జిల్లాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోంది.



# రాయలసీమలో రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు

తిరుపతి, నవంబర్ 7, ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులు రానున్నాయి. రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ సిద్ధమైంది. పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనుంది. త్వరలో విశాఖపట్నంలో జరగనున్న సీసీఐ భాగస్వామ్య సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వం, కంపెనీ మధ్య అవగాహన ఒప్పంద కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 77 వేల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా.ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి రానుంది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో.. రూ.22,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 7000 మందికి, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని అంచనా. కాగా, విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో జరగనున్న సీసీఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ మధ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సమాచారం.రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాల్లో.. 1,750 మెగావాట్ల సోలార్/ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం ప్రాజెక్టులు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ , సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా టెండర్లలో భాగంగా ఎస్ఏఈఎల్ ఈ ప్రాజెక్టులు చేపడుతోంది. పరిశ్రమలు, డేటా సెంటర్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం లక్ష్యంగా వీటిని నిర్మిస్తున్నారు. అంతేకాకుండా 200 మెగావాట్ల బయోమాస్ ప్రాజెక్టును చేపడుతున్నారు. అందులో భాగంగా 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పలు బయోమాస్ ప్లాంట్లను నిర్మిస్తారు. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.అంతేకాకుండా, రూ. 3000 కోట్లతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ అవకాశాలు వినియోగించుకోవచ్చు. మారిటైం రంగంలో లాజిస్టిక్స్‌ను, ఎగుమతులను బలోపేతం చేసేందుకు రూ.4000 కోట్ల పెట్టుబడితో పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. కాగా, తమ కంపెనీ ఇప్పటికే ఏపీలో రూ. 3,200 కోట్లు పెట్టుబడులు చేసినట్లు ఎస్ఏఈఎల్ తెలిపింది. 9 నెలల్లో 600 మెగావాట్ల సామర్థ్యాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపింది.కాగా, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ల నెట్వర్క్ ఏర్పాటు, గ్రీన్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ అభివృద్ధి చేసేందుకు రూ.20 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవల హిందూజా గ్రూప్ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే.తర్వాత శుద్ధ ఇంధనం (క్లీన్ ఎనర్జీ) రంగంలో ఏపీకి భారీ పెట్టుబడులు వచ్చాయి. కర్నూలు జిల్లాలో బ్రూక్ ఫీల్డ్ చేపట్టనున్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఖీఇఅ) రూ.7,500 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొత్తం రూ.9,910 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. అందులో భాగంగా 640 మెగావాట్ల పవన విద్యుత్, 400 మెగావాట్ల సౌర శక్తితో.. మొత్తంగా 1040 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, ఇప్పటివరకు ఒక ప్రైవేట్ ప్రాజెక్టుకు ఆర్ఈసీ.. ఇంత భారీ మొత్తంలో నిధులు ఇవ్వడం ఇదే మొదటిసారి అని అధికార వర్గాలు వెల్లడించాయి.

# గ్రామ సచివాలయాలు కాదు ఇక విజన్ యూనిట్స్

విజయవాడ, నవంబర్ 7, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు గ్రామ సచివాలయాల పేరును 'విజన్ యూనిట్స్'గా మారుస్తున్నట్లుగా ప్రకటించారు. ఇక నుంచి ఈ యూనిట్లు ప్రజలకు సేవలు సమర్థవంతంగా అందించే కేంద్రాలుగా రూపొందుతాయని ప్రకటించారు. రాష్ట్రంలోని 13,326 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈ మార్పు 2024 ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా వచ్చిన 'స్వర్ణాంధ్ర విజన్ 2047'కు అనుగుణంగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. అమరావతిలో డేటా డ్రివెన్ గవర్నెన్స్ పై జరిగిన సమావేశంలో చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. గ్రామ సచివాలయాలను మరింత ఎఫెక్టివ్‌గా మార్చాల్సి ఉందని.. చంద్రబాబు భావిస్తున్నారు. ఇక నుంచి వీటిని 'విజన్ యూనిట్స్'గా పిలుస్తామని.. ఇవి ప్రజలకు సేవలు అందించే కేంద్రాలుగా మాత్రమే కాకుండా, గ్రామీణ వికాసానికి విజనరీ ప్లాన్‌లు రూపొందించే యూనిట్లుగా పనిచేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను జగన్ సీఎంగా ఉన్నప్పుడు తీసుకు వచ్చారు. ప్రతి రెండు వేల మందికి ఓ సచివాలయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, పట్టణాల్లో వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఒక్కో దాంట్లో పదమూడు మంది సిబ్బందిని నియమించారు. పంచాయతీ కార్యాలయాలు చేయాల్సిన పనులన్నీ గ్రామ, వార్డు సచివాలయాలు చేయడం ప్రారంభించాయి. అదే సమయంలో సిబ్బందికి పని ఉండటం కష్టమయింది. నియామకాలపైనా ఎన్నో వివాదాలు వచ్చాయి. ప్రభుత్వం మారిన తరవాత సచివాలయ ఉద్యోగుల్ని ఎక్కువగా ఎలా ఉపయోగించుకోవాలన్నదానిపై కసరత్తు జరిపారు. వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. కొంత మందితో పెన్షన్లు పంపిణీ చేయిస్తున్నారు. మిగిలిన వారికి కొత్త బాధ్యతలు అప్పగించాలని.. మొత్తం వ్యవస్థను సంస్కరించాలని నిర్ణయించారు. అందుకే విజన్ యూనిట్స్ గా మార్చాలని డిసైడయ్యారు.

# అంతర్జాతీయ ఈవెంట్లతో మెరిసిపోనున్న విశాఖ

విశాఖపట్టణం, నవంబర్ 7,ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖ ఇప్పుడు అంతర్జాతీయ ఈవెంట్లకు వేదికగా మారుతోంది. విశాఖ నగరం పలు కీలక అంశాలకు వేదికగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న పలు వేడుకలకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. దేశ విదేశాల నుంచి అంతర్జాతీయ ప్రముఖులు విశాఖ వస్తున్నారు. అందుకే నిఘా పెంచారు. పటిష్టమైన భద్రత వ్యవస్థను నెలకొల్పుతున్నారు. అదే సమయంలో వచ్చే అతిథులు మంత్ర ముగ్ధులయ్యేలా నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సిటీ బ్యూటీఫికేషన్ తో పాటుగా సరికొత్తగా నగరంలోని ప్రముఖ కూడళ్లను తీర్చిదిద్దుతున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ విభాగాలన్నీ పూర్తి స్థాయిలో పనులు చేయిస్తున్నాయి. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా కవన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో పెట్టుబడుదారుల సదస్సు జరగబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సమ్మిట్ ను నిర్వహిస్తోంది. ఆంధ్రాయూనివర్సిటీ ఇంజనీరింగ్ గ్రౌండ్ లో జరగనున్న ఈ సదస్సు దేశంలోని ప్రముఖ వ్యాపార వేత్తలతో పాటుగా అంతర్జాతీయ స్థాయి వ్యాపార దిగ్గజాలు, వాణిజ్య సంస్థలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యే అవకాశం ఉంది. దాదాపుగా రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడుల సమీకరణ లక్ష్యంగా సమ్మిట్ నిర్వహిస్తుండటంతో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు, నగర సుందరీకరణ పనలు చేపడుతున్నారు. నారా లోకేష్ స్వయంగా ఏర్పాట్లను చూసుకుంటున్నారు.భారత నావికాదళానికి అత్యంత కీలకమైన విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నావికాదళం దేశ రక్షణకు సంబంధించిన ప్రతిష్టాత్మక వేడుకలను విశాఖలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 2026 ఫిబ్రవరి 15 నుంచి 25 వరకు ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ ఆర్) జరగనుంది. పలు ప్రపంచ దేశాలకు చెందిన నావికాదళాలు ఈ వేడుకలకు హాజరై తమ నౌకాదళ అస్త్రాలు, ఆయుధ సంపత్తి శక్తి సామర్థ్యాలను ప్రదర్శించబోతున్నాయి. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా హాజరుకానున్నారు. అలాగే మన నౌకాదళానికి చెందిన ఐఎన్ ఎస్ విక్రాంత్ జలాంతర్గామి నుంచి ఆయుధ సంపత్తిని రాష్ట్రపతి పరిశీలిస్తారు.మిలాన్ పేరిట నౌకాదళానికి చెందిన మరో కీలక వేడుకకు కూడా విశాఖ ఆతిధ్యం ఇవ్వబోతోంది. పలు దేశాలకు చెందిన నౌకాదళాలు, కోస్టు గార్డులు మిలాన్ వేడుకలకు హాజరుకానున్నాయి. సాగర తీరంలో తమ విన్యాసాలను ఈ మిలాన్ లో భాగంగా ప్రదర్శించబోతున్నాయి. సిటీ పరేడ్ అత్యంత ఆకర్షణగా నిలబోతోంది. అలాగే భారత నావికాదళం ఆధ్వర్యంలో పలు దేశాలకు నేవీ అధిపతులు సదస్సు కూడా జరగనుంది. పలు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరుచుకోవడం, పరస్పరం సమాచారం అందిపుచ్చుకోవడం, పకడ్బందీ భద్రతపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఇలా అంతర్జాతీయంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన సదస్సులకు విశాఖ వేదిక కావడంతో అంతర్జాతీయంగా పేరు మార్మోగనుంది.

# పాదయాత్రకు సిద్ధమౌతున్న బోడె రామచంద్ర యాదవ్

తిరుపతి, శ్రీకాకుళం, నవంబర్ 7,ఏపీలో ప్రతిపక్ష పార్టీ లేదు. తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకపోవడంతో అసెంబ్లీకి హాజరు కావడం లేదు జగన్మోహన్ రెడ్డి. వారంలో నాలుగు రోజులు పాటు బెంగళూరులో.. మూడు రోజులపాటు తాడేపల్లి కి వచ్చి వెళ్తున్నారు జగన్మోహన్ రెడ్డి. మధ్య మధ్యలో కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేస్తూ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో ప్రజలకు భరోసా ఇచ్చేవారు కరువయ్యారు. మొన్న తుఫాన్ వెళ్లిపోయిన వారం రోజుల తర్వాత బాధితులను పరామర్శించడం విమర్శలకు గురిచేసింది. జగన్మోహన్ రెడ్డి తీరు ఇలా ఉంటే మిగతా రాజకీయ పక్షాల పనితీరు కూడా అలానే ఉంది. రాజకీయ విమర్శలు చేయడంలో దూకుడు ప్రదర్శించే కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల.. ఇప్పుడు మాత్రం కనిపించకుండా మానేశారు. ప్రజలు సమస్యల్లో ఉంటే కనీసం పరామర్శించిన దాఖలాలు లేవు. వామపక్షాల ది అదే పరిస్థితి. ఇటువంటి తరుణంలో ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు సిద్ధపడుతున్నారు బోడె రామచంద్ర యాదవ్. భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు. ఏపీ ప్రజల్లో పట్టు పెంచుకునేందుకు ఆయన కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.బోడె రామచంద్ర యాదవ్ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో సుపరిచితమైన పేరు. అయితే కోస్తాతో పాటు రాయలసీమలో ఆయన పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కానీ గోదావరి తో పాటు ఉత్తరాంధ్రలో సైతం తన పేరు మార్మోగేలా చూడాలని చూస్తున్నారు. భవిష్యత్తు రాజకీయాలను అంచనా వేసుకుని అడుగులు వేస్తున్నారు. 2024 ఎన్నికల కు ముందు గ్రాండ్ గా తన పార్టీని ప్రారంభించారు. కేవలం తన సొంత నియోజకవర్గ పుంగనూరులో పట్టు కోసం తపించిన ఆయన బీసీ నినాదంతో బీసీవై పార్టీని ఏర్పాటు చేశారు. ముందుగా అదో పార్టీ ఉందని గుర్తించుకునేలా చేశారు. ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లి తనను గుర్తించాలని కోరనున్నారు.కాశీ బుగ్గ తొక్కిసలాట ఘటనకు సంబంధించి బాధితులను ఇటీవల రామచంద్ర యాదవ్ పరామర్శించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తు రాజకీయాలు చేసేందుకు రామచంద్ర యాదవ్ ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసేందుకు సిద్ధపడినట్లు సమాచారం. తద్వారా బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీగా బీసీవై పార్టీని తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. అదే సమయంలో ఏపీలో కూటమికి ధీటుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపడక పోవడానికి కూడా గుర్తించారు. అందుకే జగన్ కంటే ప్రజల్లోకి ముందుగా వెళ్లి వారికి దగ్గర ఏ ప్రయత్నం చేస్తున్నారన్నమాట. మరి ఈ ప్రచారంలో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# తాడిపత్రిలో గంజాయి కలకలం

### వైసిపి నేత ఇంటి వెనకాలనే గంజాయి మొక్కల పెంపకం

### విచారణ చేస్తున్న పోలీసు అధికారులు

తాడిపత్రి,తాడిపత్రిలో గంజాయి అమ్ముతున్నారు అని నిత్యం చెప్పే పెద్దారెడ్డి కి సంబంధించిన అనుచరుడు టైలర్స్ కాలనీ హరి ఇంటి వెనకాలనే గంజాయి మొక్కలు ప్రత్యక్షం కావడం తాడిపత్రి పట్టణంలో కలకలం లేగుతుంది వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో కూడా కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎమ్మెల్యే అనుచరులు గంజాయి తాగి ఇద్దరు మహిళలను చేసిన సంఘటన విధితమే నేడు తిరిగి అదే పెద్దారెడ్డికి సంబంధించిన అనుచరుడు ఇంటి వెనకాలే గంజాయి మొక్కలు ప్రత్యక్షమవడం పలు అనుమానాలకు తావిస్తోంది

## నేడు సూర్య దేవాలయంలో సంకష్టహర చతుర్థి ప్రదోష పూజ..



విభారే న్యూస్ నవంబర్ 7 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో సంకష్టహర చతుర్థిప్రదోష పూజ 08/11/2025 అనగా విశ్వవసు నామ సంవత్సరం, కార్తీక మాసం,శనివారము సంకష్టహర చతుర్థి నిర్వహించబడును. ఈ సందర్భంగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి "సంకష్టహర చతుర్థి ప్రదోష పూజ" విశేషముగా జరుగును . వరసిద్ధి వినాయక స్వామి వారిని పూజిస్తే అనుకున్న పనులు వెంటనే జరుగుతాయి ఏ కార్యం తలపెట్టిన విఘ్నాలు రావు మరియు మీ జాతకం లో బుధ, కేతు గ్రహాలు కలిగించు ఆటంకాలు తొలగిపోయి శుభ ఫలితాలను ప్రసాదించును. అటువంటి స్వామి వారికి ఈ రోజున ఉదయం 10:30 గం"లకు లక్ష్మీ గణపతి మూల మంత్ర సహిత లక్ష్మీ గణపతి హోమం జరుగును. సాయంకాలము 6:00 గంటలకు పంచామృత అభిషేకం , సంకష్టహర చతుర్థి ప్రదోష పూజ జరుగును. ఇందు భక్తులు విశేషముగా పాల్గొని శుభ ఫలితాలు పొందగలరు. సమయపాలన పాటించగలరని మనవి.సంకటహర చతుర్థి ప్రదోష పూజ 200 /-హోమ సంకల్పం 116 /- విశేషంగా ప్రధాన హోమం 2500/- సంప్రదించవలసిన ఫోన్ నెం:-శేషసాయి శర్మ7981012787దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777.ఆఫీసు ల్యాండ్ ఫోన్ నెంబరు..08518-234388

## వందేమాతరం జాతీయ గేయం కు 150 ఏళ్లు.

- జిల్లా పోలీసు కార్యాలయంలో వందేమాతరం జాతీయ గేయం ఆలాపన



విభారే న్యూస్ నవంబర్ 7 కర్నూలు జిల్లా ప్రతినిధి..వందేమాతరం జాతీయ గేయాన్ని ఆలపించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.భారత స్వాతంత్ర్య సమరానికి ప్రేరణనిచ్చిన వందేమాతరం జాతీయ గేయం శుక్రవారం రోజు 150వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోందని బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ 7 న జాతీయ గేయం ను రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో సాముహికంగా వందేమాతరం జాతీయ గేయం ను ఆలపించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీతో పాటు పోలీసు అధికారులు , సిబ్బంది అందరూ కలిసి వందేమాతర జాతీయ గేయం ఆలాపన చేశారు. వందేమాతర జాతీయ గేయం స్వాతంత్ర్య ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చి, సామాన్యులను సమరయోధులుగా మార్చిందని,ప్రతి ఒక్కరూ జాతీయత భావాన్ని పెంపోందించుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని జిల్లా ఎస్పీ పేర్కోన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్‌పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్ ,కర్నూల్‌డిఎస్పీ బాబు ప్రసాద్,హోంగార్డ్సుడిఎస్పి ప్రసాద్, డిపిఓఎఓవిజయలక్ష్మీ,సిఐలు, ఆర్ఐలు ,ఎస్సైలు,ఆర్ఎస్సైలు,పోలీసు,డిపిఓకార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

## బస్సు ప్రమాద సంఘటనలో వి కావేరి ట్రావెల్స్ బస్సు యజమాని వేమూరి వినోద్ కుమార్ అరెస్టు.

విభారే న్యూస్ నవంబర్ 7 కర్నూలు జిల్లా ప్రతినిధి..2025 అక్టోబర్ 24 వ తేదీ తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కర్నూలు జిల్లా, ఉలిందకొండ పియస్ పరిదిలోని కల్లూరు మండలం, చెట్లమల్లాపురం గ్రామపరిదిలో 44 వ జాతీయ రహదారి పై వి కావేరీ ట్రావెల్ బస్సు ప్రమాదంలో 19 మంది చనిపోయారు.ఈ సంఘటన పై వి కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మరియు ఓనర్ ల పై కేసు నమోదు చేశారు.ఈ కేసు విచారణ అధికారి అయిన పత్తికొండ డిఎస్పీ వెంకట రామయ్య ఈ కేసును క్షుణ్ణంగా విచారించారు.ఈ సంఘటనలో మొదటి నిందితుడైన మిరియాల లక్ష్మయ్య ను 2025 అక్టోబర్ 28 తేదిన కర్నూలు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పెట్టడం జరిగింది.అదే విధంగా ఈ కేసు లో రెండవ ముద్దాయి వి కావేరీ ట్రావెల్స్ బస్సు ఓనర్ అయిన వేమూరి వినోద్ కుమార్ ను శుక్రవారం (2025 నవంబర్ 07) ఉదయం 07.30 గంటలకు కర్నూలు పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది.అనంతరం ముద్దాయిని గౌరవనీయ జే ఎఫ్ సి ఎం,స్పెషల్ మొబైల్ కోర్టు వారి ఎదుట హాజరు పెట్టడం జరిగింది.

## ఆధ్యాత్మిక చింతనతో జీవితం సార్థకం అవుతుంది

### ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలి:అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 07:ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మనసుకు ప్రశాంతి, సమాజానికి శాంతి కలిగే దిశగా నడవాలని నంద్యాల అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.శుక్రవారం నంద్యాల పట్టణంలోని ప్రథమ నందేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆధ్యాత్మికత అంటే కేవలం పూజలు చేయడం మాత్రమే కాదు, మనసులో దయ, సహనం, సేవా భావం పెంపొందించుకోవడం కూడా అంతే ముఖ్యమైందని" పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో ఆధ్యాత్మికత కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి వ్యక్తి జీవితంలో ఇది ఒక నిత్య సాధనగా మారాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సభ్యులు చలంబాబు, డిప్యూటీ తహసీల్దార్ రామ సంజీవరావు, సర్వేయర్ సహదేవుడు, రెవిన్యూ అధికారులు, వీఆర్వోలు, భక్తులు పాల్గొన్నారు.

## బండి ఆత్మకూరులో వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలు

### దేశభక్తిని ఆచరణలో చూపాలని అభిరుచి మధు పిలుపు





-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 07-నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు రాఘవేంద్ర పాఠశాలలో వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ ? "వందేమాతరం గీతం దేశభక్తి, ఐక్యత, జాతీయతకు ప్రతీక. ఈ గీతం భారత స్వాతంత్ర్య సమరయోధులలో త్యాగస్ఫూర్తి, దేశ ప్రేమను నింపింది. మన విద్యార్థులు కూడా ఈ ఆత్మస్ఫూర్తిని గ్రహించి దేశం కోసం కృషి చేయాలి" అన్నారు.అభిరుచి మధు మరింతగా మాట్లాడుతూ ? దేశం కోసం ప్రాణాలర్పించిన మహానుభావులను స్మరించుకోవడం మన కర్తవ్యమని, యువతలో దేశభక్తి భావనను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావం, సమాజం పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలన్నారు.జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ? విద్యార్థులు కేవలం పాఠశాల గోడలకే పరిమితం కాకుండా దేశం కోసం ఏదైనా చేయాలనే సంకల్పాన్ని అలవరచుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఇంటి ఆదినారాయణ, లింగన్న, వెంకట సుబ్బయ్య, నిమ్మకాయల సుధాకర్ పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు సమూహంగా వందేమాతరం గీతం ఆలపించి దేశభక్తి ఉత్సాహాన్ని నింపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వందేమాతరం గీతం దేశభక్తికి ప్రతీక

### దేశ ఐక్యతకు వందేమాతరం గీతం ప్రేరణ
### నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 07-వందేమాతరం గీతం దేశభక్తిని, ఐక్యతను, జాతీయతను ప్రతిబింబిస్తుందని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు అన్నారు.భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ ? "వందేమాతరం గీతం స్వతంత్ర ఉద్యమంలో ప్రజలలో చైతన్యాన్ని నింపిన ప్రేరణామూర్తి. దేశ స్వాతంత్ర్య పోరాటంలో త్యాగం, దేశభక్తి, ఐక్యతకు చిహ్నంగా నిలిచింది. స్వర్గీయ బంకిమ్ చంద్ర చటర్జీ 1852లో రచించిన ఈ గీతం భారత జాతి గౌరవానికి ప్రతీకగా నిలిచింది" అని అన్నారు .తదుపరి ఆయన మాట్లాడుతూ ? "దేశంలో మతం, భాష, ప్రాంతం అనే భేదాలు లేకుండా ప్రజలందరినీ ఒకే తాటిపైకి తెచ్చిన శక్తి వందేమాతరం గీతమే. ఈ స్ఫూర్తిని ప్రతి విద్యార్థి, ప్రతి పౌరుడు హృదయంలో నాటుకోవాలి. దేశ సేవలో ఈ చైతన్యాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు, బిజెపి నాయకులు దేశభక్తితో నిండిన గళంతో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. దేశభక్తి, ఐక్యత, జాతీయత పట్ల తమకున్న అంకితభావాన్ని మరోసారి చాటుకున్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు, బిజెపి నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు

## "స్వతంత్ర పోరాటంలో వందేమాతర గీతం ది ప్రత్యేక స్థానం"...

### అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ & కే.యంసి ప్రిన్సిపాల్ డా.కె.చిట్టి నరసమ్మ...

కర్నూలు స్వాతి కిరణం ప్రతినిధి :-స్వతంత్ర పోరాటంలో వందేమాతర గీతం ది ప్రత్యేక స్థానమని ఈ గీతం కొన్ని లక్షల మందిని స్వాతంత్ర ఉద్యమం వైపు నడిపించిందని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ అన్నారు. వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు మెడికల్ కాలేజీ యందు విద్యార్థులచే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ "వందేమాతరం" అంటూ "ఉరి కంభం వైపు నడిచిన మొట్టమొదటి వ్యక్తి" బెంగాల్ సాయుధ పోరాట దళం పోరాటయోధుడు కుదిరామ్ బోస్ అని తెలిపారు. విద్యార్థులకు వందేమాతరం పాట యొక్క చరిత్రను వివరించి వారందరిచే వందేమాతర గీతాన్ని ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సింధియా శుభప్రద, ఆనాటమీ బయో కెమిస్ట్రీ విభాగాధిపతులు ప్రో. డా. శోభ దేవి, డా కిరణ్మయి, వైద్య ఆధ్యాపకులు డా . కృష్ణమోహన్, డా. సోమశేఖర్, డా. రేఖ డా. గాయత్రి, డా.విజయలక్ష్మి, డా మనోజ్ కుమార్ రెడ్డి, డా. లోకనాథ్, డా .లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## నంద్యాలలో యూరాలజీ వైద్యుల సదస్సు

### రెండు తెలుగు రాష్ట్రాల సంయుక్త నిర్వహణ
### 8, 9 తేదీల్లో వైజ్ఞానిక సదస్సు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 07-నంద్యాల, కర్నూలు యూరాలజీ వైద్యుల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల యూరాలజీ వైద్యుల 37వ వార్షిక వైజ్ఞానిక సదస్సు ఈనెల 8, 9 తేదీల్లో నంద్యాల సౌజన్య కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతుంది.సదస్సు వివరాలను నిర్వాహక కార్యదర్శి డాక్టర్ భార్గవ వర్ధన్ రెడ్డి, ఐఎంఏ మాజీ రాష్ట్రాధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, కోశాధికారి డాక్టర్ జై బాబు రెడ్డి శుక్రవారం ఐఎంఏ కార్యాలయంలో ఆవిష్కరించారు.రాష్ట్రస్థాయి సదస్సులో 25 మంది ప్రముఖ యూరాలజీ నిపుణులు వైద్య అంశాలపై ప్రసంగించనున్నారు. పీజీ విద్యార్థులు పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది వైద్యులు పాల్గొననున్నారు.శనివారం సాయంత్రం 4 గంటలకు సదస్సు ప్రారంభోత్సవం జరుగుతుంది. ఇందులో డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ విక్రమసింహారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ? యూరాలజీ రంగంలో ఆధునిక పరికరాలు, చికిత్సా విధానాలపై అవగాహన కల్పించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ దాసరి రమేష్, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కార్యాలయంలో దేశభక్తి గీతాలాపన

### వందేమాతరం గీతం దేశభక్తికి ప్రతీక -ఎస్పీ సునీల్ షొరాన్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 07-నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. జిల్లా ఎస్పీ సునీల్ షొరాన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, నలందా స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ సునీల్ షొరాన్ మాట్లాడుతూ ?వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన గీతమని, 1852లో బంకిమ్ చటర్జీ రచించిన ఈ గీతం 1875లో జాతీయ గీతంగా గుర్తించబడిందని తెలిపారు. ఈ గీతం దేశ ప్రజల్లో ఐక్యత, జాతీయత, త్యాగ స్ఫూర్తిని నింపిందని అన్నారు.పోలీస్ అధికారులు ప్రజల సేవలో అదే జాతీయ స్ఫూర్తితో కొనసాగాలని సూచించారు. దేశభక్తి, ఐక్యత, జాతీయత పట్ల అంకితభావంతో ప్రతి పోలీసు సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు.తదుపరి దేశభక్తి గీతాలాపనలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ఏకస్వరంతో వందేమాతరం గీతం ఆలపించారు. ఈ సందర్భంగా దేశభక్తి, ఐక్యతా భావం ప్రతిధ్వనించింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ ఎం. జావళి, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్. యుగంధర్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఏ ఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు మోహన్ రెడ్డి, సూర్యమౌళి, జీవన్ బాబు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, సురేష్ బాబు, ఆర్ ఎస్ ఐలు, డీపిఓ సిబ్బంది, పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## మహానంది పుణ్యక్షేత్రంలో ఘనంగా హోమాలు, కళ్యాణ మహోత్సవం

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 07-:కార్తీక మాసం శుక్రవారం సందర్భంగా మహానంది పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. వేదపండితుల ఆధ్వర్యంలో నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మల వేద మంత్రాల నాదంతో యజ్ఞవేదిక శోభాయమానమైంది. హోమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారు.హోమాల అనంతరం శ్రీ గంగా కామేశ్వరి సమేత మహానందిశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు కుటుంబ సమేతంగా కళ్యాణ మహోత్సవాన్ని దర్శించి పుణ్యఫలాన్ని పొందారు. దేవస్థానం ప్రాంగణం నిండా హారతులు, మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక ఆనందం నెలకొంది.భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసం ప్రతి రోజూ నిర్వహించే పూజా కార్యక్రమాలకు భక్తులు విపరీతంగా హాజరవుతుండటంతో మహానంది క్షేత్రం భక్తజన సందోహంతో కళకళలాడుతోంది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190